Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 323 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 2 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

# పహల్గాం దాడి ఘటనపై న్యాయవిచారణ.. సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై న్యాయ విచారణ జరపాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరించింది. సైనికుల మనోధైర్యాన్ని దెబ్బ తీయకండంటూ పిటిషనర్‌ను కోరింది. గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ పిటిషన్ విచారణపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ పిటీషన్ దాఖలు చేసే ముందు ఈ అంశంలోని సున్నితత్వాన్ని చూడాలని పిటీషనర్‌కు సూచించారు. ఈ తరహా ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేసేందుకు బాధ్యతతో వ్యవహరించాలంటూ హితవు పలికింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు చేతులు కలిపి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అందులో మీ కర్తవ్యాన్ని సైతం నిర్వహించాలని పిటీషనర్‌తో పేర్కొన్నారు. అంతేకాదు న్యాయమూర్తుల పని.. వివాదాలపై నిర్ణయం తీసుకోవడమే తప్ప విచారణలు నిర్వహించడం కాదని జస్టిస్ సూర్యకాంత్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పహల్గాంలో ఉగ్రదాడి జరగడం వల్ల 26 మంది మృతిపై న్యాయ కమిషన్ ఏర్పాటు చేసి.. రిటైర్డ్ న్యాయమూర్తి చేత విచారణ జరపాలంటూ పిటీషనర్ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి పైవిధంగా స్పందించారు. మనం ఎప్పటి నుండి దర్యాప్తులో నైపుణ్యాన్ని సంపాదించాము? మీరు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిని దర్యాప్తు చేయమని అడుగుతున్నారు. వారు తీర్పు మాత్రమే చెప్పగలరు. మమ్మల్ని ఆదేశాలు జారీ చేయమని అడగకండని పిటిషనర్‌ను న్యాయమూర్తి మందలించారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో కాకుండా బయట చదువుతోన్న విద్యార్థులపై జరుగుతోన్న దాడులను సైతం ఈ పిటీషన్‌లో స్పష్టం చేయడం పట్ల న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు ఈ దాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారణ జరుపుతోన్న సంగతి తెలిసిందే.

# ఆ పురుగులను ఏరిపారేయాలి : గణపతి సచ్చిదానంద స్వామి

**అనంతపురం జిల్లా, (రాజధాని వార్తలు):** భారత్, పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలో లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మీడి యాతో మాట్లాడుతూ.. ఉగ్రవాదులను పట్టుకుని శిక్షించాలన్న దృష్టి కేంద్రానికి ఉన్నట్టు తెలుస్తోందని.... ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి తన ఆశీస్సులు అంటూ ఆయన పేర్కొ న్నారు. రాష్ట్రంలో, దేశ సరిహద్దుల్లో పురుగులు ఉన్నాయని, అన్నింటినీ ఏరి వేయాలని అన్నారు. మనల్ని రక్షించుకోవాలంటే చీడపురుగులకు పురుగుల మందు కొట్టాల్సిందేనన్నారు. మన దేశమే కాదు ప్రపంచంలో ఎక్కడా ఉగ్రవాదం ఉండకూడదని ఆయన ఆకాంక్షించారు. ధర్మం ఆధారంగా చంపడం తనకు చాలా బాధ కలిగించిందన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే శక్తి దేశ పౌరులందరికీ కల్పించాలని... శాంతి కలగాలని కోరుకుంటున్నానని అన్నారు. ఉగ్రవాదులకు శిక్ష పడుతుందని... ఇవాళ దేశానికి పటిష్టమైన నాయకత్వం ఉందని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి అభిప్రాయం వ్యక్తం చేశారు.

**జయలక్ష్మి మాతకు ప్రత్యేక పూజలు..**




కాగా రాప్తాడు మండలంలోని బుధవారం బొమ్మేపర్తి గ్రామంలో వెలసిన జయలక్ష్మీ మాత విగ్రహానికి శ్రీ గణపతి సచ్చిదానందస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం నుంచి బొమ్మేపర్తి ఆశ్రమంలో జయలక్ష్మీ మాత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా గణపతి సచ్చిదానందస్వామి జయలక్ష్మి మాతకు పలు రకాలు పూజలు చేశారు. భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. జయలక్ష్మి పురం గ్రామంలో బుధవారం (ఏప్రిల్ 30వ తేదీ) నుంచి మే 4వ తేదీ వరకు శ్రీ జయలక్ష్మీ మాత జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలలో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి పాల్గొంటారని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.


# మమ్మల్ని ఆదర్శంగా తీసుకోండి.. కేంద్రానికి రేవంత్ సూచన



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేస్తామంటూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కేంద్ర నిర్ణయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జనగణనతో పాటు కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కులగణన నిర్ణయం విషయంలో రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలియజేశారు. కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారని.. రాహుల్ పాదయాత్రలో కుల గణనపై చర్చ చేశారన్నారు. కుల గణన చేయాల్సిందేనని రాహుల్ తేల్చి చెప్పారని తెలిపారు. కేంద్రం నిర్ణయంపై రాజకీయాలు మాట్లాడదల్చుకోలేదని వెల్లడించారు. కుల గణనపై తెలంగాణ రాష్ట్రానికి అవగాహన ఉందన్నారు. కుల గణన కోసం దేశ వ్యాప్తంగా ఒక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కులం ఒక్కో జాబితాలో ఉందని తెలిపారు. కుల గణన కోసం మంత్రులతో ఒక కమిటీ ఏర్పడి చేయాలని.. అధికారులతో, నిపుణులతో ఒక కమిటీ వేసి అధ్యయనం చేయాలని సూచించారు. కుల గణన కోసం తెలంగాణ మోడల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కేంద్రానికి తెలిపారు. మంత్రుల కమిటీ వెంటనే నియమించాలన్నారు. మంత్రుల కమిటీకి తోడుగా నిపుణుల కమిటీని వేయాలన్నారు. ఈ రెండు కమిటీలతో దేశవ్యాప్తంగా అధ్యయనం చేయించాలని తెలిపారు. తూతూ మంత్రంగా కుల గణన చేస్తే దానితో ఎలాంటి ఉపయోగం ఉండదని చెప్పుకొచ్చారు. కుల గణన దేశాన్ని జిరాక్స్ తీసినట్టు అవుతుందన్నారు. జిరాక్స్ తీస్తే రోగం ఏంటి? ఏ మందు వేయాలి అని తెలుస్తుందని తెలిపారు. తాము ప్రజల నుంచి, ప్రజా సంఘాల నుంచి అనేక విషయాలు, సూచనలు తీసుకొని కులగణన చేశామన్నారు. కుల గణన కోసం 95,000 ఎన్యూమరేటర్లను నియమించామని.. పది మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్ వైజర్‌ను నియమించినట్లు చెప్పారు. మంత్రుల కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించిందన్నారు. కుల గణన చేసిన తర్వాత పబ్లిక్ డొమైన్‌లో పెట్టామని.. కుల గణనలో పాల్గొనని వాళ్ళకి మరోసారి అవకాశం ఇచ్చామన్నారు. మూడు నెలల్లోనే ఎలాంటి ఇబ్బందులు రాకుండా కుల గణన చేశామని తెలిపారు. కుల గణన విషయంలో కేంద్రంతో కలిసి నడవడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కుల గణన విషయంలో కేంద్రానికి వచ్చే సందేహాలకు సమాధానం ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. 1931 తర్వాత కుల గణన చేసింది తెలంగాణ ప్రభుత్వమే అని అన్నారు. కుల గణన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి అన్ని రకాలుగా మద్దతు ఇస్తామని పేర్కొన్నారు.

# రైతులను పారిశ్రామికవేత్తలను చేస్తాం.. పరిశ్రమలు పెట్టండి

## - ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు (గురువారం) ప్రారంభించారు. వర్చువల్‌గా 11 ఎంఎస్ఎంఈ పార్కులను సీఎం మొదలుపెట్టారు. 14 ఎఫ్ఎఫ్‌సీలు, 25 ఎంఎస్ఎంఈ పార్కులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఏపీలో అసంఘటిత కార్మికులు అధికంగా ఉన్నారని... అందులోనూ వ్యవసాయం మీద అత్యధికంగా ఆధారపడ్డారన్నారు. ఇప్పుడే భవన నిర్మాణ కార్మికుల బాధలు చూశానని... మిట్టమధ్యాహ్నం వేళ కాలే ఇనుప కమ్మీలతో పనిచేస్తున్నారని.. వారందర్నీ ఆదుకోవడం మనందరి బాధ్యత అని చెప్పుకొచ్చారు. టీడీపీ సింబల్‌లో పేదలకు గుర్తుగా ఇళ్లు, రైతులకు గుర్తుగా నాగలి, కార్మికులకు గుర్తుగా చక్రం ఉంటుందని.. ఆ చక్రం దేశంలోని ఏ పార్టీ సింబల్‌లో ఉండదన్నారు.

**వారిని కోటీశ్వరులను చేయాలనుకున్నాం**

గత ప్రభుత్వంలో ఇసుక దోపిడీ చేశారని మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇసుక ఉచితం చేశామని... భవన నిర్మాణ కార్మికుల పనుల కోసం భవన అనుమతులు తేలికగా పొందే వీలు కల్పించామన్నారు. నారంపేట ఎంఎస్ఎంఈ పార్కులో నేరుగా పరిశ్రమ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. షెడ్లు, కరెంటు అందుబాటులో ఉంటాయని. కామన్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. 34వేల ఎకరాల్లో అమరావతిని నిర్మించి అక్కడి వారిని కోటీశ్వరులని చేయాలనుకున్నామన్నారు. 29 వేల మంది రైతులు భూములిచ్చారని.. ఎక్కడా రైతుకి అన్యాయం జరగకుండా చూసిన పార్టీ టీడీపీ అని వెల్లడించారు. కొందరికి అభివృద్ధి జరగకూడదని... పుల్లలు పెడుతుంటారని మండిపడ్డారు.

**భవిష్యత్తు ఏఐ దే**

నెల్లూరు జిల్లాలో తరతరాలుగా యానాదులు పేదరికంలో ఉన్నారన్నారు. ఏపీలో 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. నారంపేట పార్కు వల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతాయన్నారు. 50 ఎంఎస్ఎంఈ పార్కులను ఇక్కడి నుంచే ప్రారంభించామని.. మండలానికో ఎంఎస్ఎంఈ పార్కు తీసుకు రావాలన్నది తమ లక్ష్యమని స్పష్టం చేశారు. పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వంపై నమ్మకం ఉందని... భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే అని చెప్పుకొచ్చారు. వైజాగ్, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతరం కేంద్రంగా అయిదు రీజనల్ హబ్‌లు పెడుతున్నామన్నారు. పరిశ్రమలను విద్యాసంస్థలను అనుసంధానం చేయబోతున్నామన్నారు. యువత అందరికీ మంచి ఆలోచనలు ఉన్నాయన్నారు. ఉద్యోగం పొందడం కాదని, ఉద్యోగాలిచ్చే స్థాయిలో ఉండాలని సూచించారు. ఐటీ వల్ల ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా మన తెలుగు బిడ్డలు ఉన్నారని... ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

**ఆ బాధ్యత ఆనం దే**


పరిశ్రమలకు లోన్లు, అనుమతులు వంటివి సింగిల్ విండో ద్వారా త్వరగా ఇస్తామన్నారు. ప్లగ్ అండ్ ప్లే... ఎంఎస్ఎంఈలో అన్ని సిద్ధంగా ఉంటాయన్నారు. యంత్రాలు తెచ్చుకుంటే చాలన్నారు. ఫ్లడెడ్ ఫ్యాక్టరీ ప్రారంభించడం ఆనందదాయకంగా ఉందన్నారు. అధికారులు, ఎమ్మెల్యేలు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలను సూచించారు. ఇక్కడ ఎంఎస్ఎంఈలో పరిశ్రమలు ఏర్పాటు చేయించే బాధ్యత ఆనం రామనారాయణరెడ్డిదే అని అన్నారు. రైతులను పారిశ్రామికవేత్తలని చేయాలని.. భూమి మీది అని.. మీరూ నానో పార్కులు తీసుకుని పరిశ్రమలు పెట్టాలని కోరారు. ఆడబిడ్డలు బాగా చదువుకున్నారని... మీరు కూడా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**ఇంకా పరిశ్రమలు వస్తాయ్**

ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా కూడా నా రాజధాని అమరావతి అని చెప్పుకోవాలన్నారు. దగదర్తిలో త్వరలోనే ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభించి, త్వరగా పూర్తి చేస్తామన్నారు. పోర్టులు, రైల్వే లైన్లు, నేషనల్ రోడ్లు, పరిశ్రమలు వస్తుంటే ఇంకేమి కావాలన్నారు. ఇప్పటికే చాలా పరిశ్రమలు వచ్చాయని... ఇంకా పరిశ్రమలు వస్తాయన్నారు. సోమశిల నీరు ఆత్మకూరుకి ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వానిది అని స్పష్టం చేశారు. శ్రీశైలం నీటిని నెల్లూరుకు ఇచ్చిన తరువాతే తమిళనాడుకు వెళ్లాలని ఎన్టీఆర్ పట్టుబట్టారన్నారు. అందుకే సోమశిలకి నీరొస్తుందన్నారు. కండలేరు కూడా ఆయనే నిర్మించారని తెలిపారు. ఆత్మకూరులో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తామన్నారు. సంపద సృష్టిస్తేనే అభివృద్ధి జరుగుతందన్నారు. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా ఫించన్లు ఇస్తున్నామన్నారు. మొదట పింఛన్లు ఇచ్చిన మహానుభావుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. దివ్యాంగులపై అత్యంత ప్రేమ చూపిన పార్టీ టీడీపీ, ఎన్డీఏ అని చెప్పుకొచ్చారు. ఒక ప్రాంతంలో వంద మంది ఉంటే, బాగా పేదరికంలో ఉన్నవారి బాధ్యతను ఆర్థికంగా అభివృద్ధి చెందిన ఇరవై మంది అన్నీ చూసుకుంటారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# ఏపీ లిక్కర్ స్కాం.. రాజ్ కేసిరెడ్డికి ఎదురు దెబ్బ

**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడు రాజ్ కేసిరెడ్డికి బిగ్ షాక్ తగిలింది. రాజ్ కేసిరెడ్డిని సీఐడీ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రేపటి (శుక్రవారం) నుంచి ఏడు రోజుల పాటు విచారించేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు రాజ్ కేసిరెడ్డి విచారణకు న్యాయస్థానం అంగీకారం తెలిపింది. ఈ విచారణ ద్వారా రాజ్ కేసిరెడ్డి వెనుక ఉన్న సూత్రధారుల వివరాలను రాబట్టాలని సీఐడీ అధికారులు చూస్తున్నారు. కాగా.. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్‌కేసిరెడ్డిని ఇటీవలే పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. లిక్కర్ స్కామ్‌కు సంబంధించి కేసిరెడ్డికి అనేక మార్లు సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. కాగా విచారణకు హాజరుకాకుండా కేసిరెడ్డి దుమ్మా కొడుతూ తప్పించుకుని తిరిగే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులోనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తరువాత అక్కడి నుంచి విజయవాడకు తీసుకువచ్చి రాత్రంతా కూడా సిట్ అధికారులు విచారణ జరిపారు. ఆపై తెల్లారి కూడా మరోసారి కేసిరెడ్డిని విచారించారు సిట్ అధికారులు. ఈ సందర్భంగా పలు కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. ఈ కేసులో సిట్ సేకరించిన పలు ఆధారాలు, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి విచారణలో చెప్పిన సమాచారంతో సిట్ అధికారులు ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. అయితే తొలుత అధికారులకు కేసిరెడ్డి సహకరించలేదని తెలుస్తోంది. రెండో విడత విచారణలో కొన్ని ఆధారాలతో సిట్ అధికారులు ప్రశ్నించగా.. కొన్నింటికి సమాధానాలు చెప్పగా.. మరికొన్నింటికి తనకు సంబంధం లేదని చెప్పినట్లు తెలుస్తోంది. సిట్ విచారణ అనంతరం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో కేసిరెడ్డి వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరిచారు. కేసిరెడ్డికి 14 రోజుల పాటు రిమాండ్ విధించింది కోర్టు. మరోవైపు ఈకేసులో ముందస్తు బెయిల్ కోసం రాజ్ కేసిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అయితే అక్కడ కూడా ఆయనకు నిరాశే ఎదురైంది. కేసిరెడ్డి పిటిషన్‌పై విచారణను హైకోర్టు వాయిదా వేసింది.



# భూ భారతి చట్టం రైతుల భూములకు రక్షణ కవచంలాంటిది

### - భూమి ఉన్న ప్రతి రైతుకు భూ భద్రత - భూ భారతి చట్టం - 2025 అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించిన గౌరవ పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**శేర్లింగంపల్లి, (రాజధాని వార్తలు):** శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ జిహెచ్ ఎంసీ జోనల్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన భూ భారతి చట్టం – 2025 అవగాహన సదస్సు కార్యక్రమంలో గౌరవ రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి, గౌరవ శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డి మరియు రెవెన్యూ సిబ్బంది గౌరవ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, రాగం నాగేందర్ యాదవ్, హమీద్ పటేల్, జగదీశ్వర్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, రెవిన్యూ సిబ్బంది ఆర్ఐ చంద్రారెడ్డి ఆర్ఐ శ్రీనివాస్ అధికారులు మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌరవ పిఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. భూ భారతి – కొత్త ఆర్ ఓ ఆర్ చట్టమని అందులో భాగంగా భూమి హక్కులు భద్రం.. భూ సమస్యల సత్వర పరిష్కారం.. రైతుల మేలు కోసం ప్రజా పాలనలో చారిత్రక




మార్పు అని పేర్కొన్నారు. భూ భారతి చట్టం.. రైతుల చుట్టమని అన్నారు. రైతుల మేలు కోసం ప్రజా పాలనలో చారిత్రక మార్పు కోసం ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం భూధార్ కార్డుల జారీ చేస్తుందని, రైతులకు ఉచిత న్యాయ సహాయం చేసే విధంగా వెసులుబాటు కల్పిస్తుందని పిఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూ భారతి నూతన ఆర్ఓ ఆర్ చట్టం 2025లో పొందుపరిచిన అంశాలు రైతుల సమస్యల పరిష్కారానికి ఎంతో మేలు చేస్తాయి అని, భూమి అనేది ఒక రైతు జీవితానికి చాలా పెద్ద ఆధారమని, ముఖ్యంగా భూ భారతి చట్టంలో అప్పీలు వ్యవస్థ చాలా కీలకమైనది అని, రైతుకు ఒకవేళ అన్యాయం జరిగితే అప్పీల్ చేసుకోవడం ద్వారా న్యాయాన్ని పొందవచ్చు అని, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్, సి సి ఎల్ ఏ స్థాయిలో అప్పీల్ చేసుకోవచ్చు అని, భూమి హక్కులను రక్షించడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని తెలంగాణ భూభారతి చట్టం ద్వార భూమి రిజిస్ట్రేషన్ రికార్డుల నిర్వహణను పూర్తిగా పారదర్శకంగా రాష్ట్ర ప్రజల ప్రయోజనానికి అనుగుణంగా తీర్చిదిద్దామన్నారు ఇకపై భూవివాదాలకు స్థానం లేకుండా భద్రమైన భూమి హక్కులు అందరికీ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పిఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, ఈ చట్టంతో సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించుకోవచ్చున్నారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాలు సైతం భూభారతిలో పరిష్కారం చేసుకోవచ్చున్నారు. జూన్ నెల నుంచి తహసీల్దార్లు మండలంలోని ప్రతీ గ్రామంలో భూభారతి సదస్సులు నిర్వహించి రైతులకు భూసమస్యలపై అవగాహన కల్పించి వచ్చిన దరఖాస్తులను పరిష్కరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రైతులు తమ భూములను ఆన్ లైన్లో చూసుకునే అవకాశం ఉంటుందన్నారు. గతంలో ఏవైనా భూ సమస్యలు వస్తే కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని భూ భారతితో 90 శాతం తహసీల్దార్ వద్దే పరిష్కారం అవుతాయని తెలిపారు. లేదంటే ఆర్డీవో, కలెక్టర్లకు అప్పీల్ చేసుకోవచ్చున్నారు. భూసమస్యల పరిష్కారానికి ఎంతో వెసులు బాటు కల్పించే భూభారతి చట్టంపై అవగాహనను ఏర్పరచుకోవాలని, దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పిఏసి చైర్మన్ గాంధీ రైతులకు సూచించారు.

# ఆంధ్రులు గర్వపడేలా అమరావతి నిర్మాణం : డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, (రాజధాని వార్తలు):** వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కిం చేందుకు కూటమి ప్రభుత్వం అమరావతికు శ్రీకారం చుట్టిందని దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. మే 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా జరగనున్న అమరావతి నిర్మాణ పనుల పునః ప్రారంభోత్సవంలో అన్ని ప్రాంతాల ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అందరి రాజధానిగా అమరావతి నిర్మాణం సాగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయి. రాజధానిలో పునర్నిర్మాణ పనులకు ప్రభుత్వం పరిపాలనానుమతులు మంజూరు చేసిందన్నారు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీల నుంచి రుణం మంజూరైందన్నారు. జర్మనీకి చెందిన డెవలప్మెంట్ బ్యాంకు కేఎఫ్ డబ్ల్యూ నుంచి రుణం పొందేందకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తూన్నట్లు పేర్కొన్నారు. ప్రజా రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుందన్నారు. పదేళ్ల తరవాత సైబరాబాద్ వద్ద పెరిగినట్లు ఇక్కడ భూములు విలువ పెరుగుతుందన్నారు. అమరావతి రాజధాని ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించనుందని, అమరావతి నగర విద్యుత్ అవసరాల నిమిత్తం 2,700 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని వినియోగించుకునేలా ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసిందన్నారు. ప్రజా రాజధాని అమరావతిపై జగన్ రెడ్డి విధ్వంసం చేశారని మండిపడ్డారు. జగన్ రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల ప్రతి పాదన కారణంగా పెట్టుబడులు గణనీయంగా పడిపోయాయన్నారు. అమరావతి మునిగిపోయే రాజధాని అని, అమరావతికి నిర్మాణం కోసం సమకూర్చుకున్న నిధులను ప్రజల నుండే వివిధ రూపాల్లో వసూలు చేస్తారని అబద్దాపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ రెడ్డి నిర్వాకం వల్ల 2 లక్షల కోట్ల రూపాయల విలువైన 130 పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార, విద్యాసంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోవడంతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతిలో రాజధాని నిర్మించడానికి మద్దతు



తెలిపి, అధికారంలోకి వచ్చాక 3 రాజధానుల పేరుతో కుల చిచ్చు, ప్రాంతీయ చిచ్చు పెట్టి తన కుంభకోణాల నుండి ప్రజల దృష్టి మళ్లించే కుట్ర చేశారని ఆరోపించారు. అమరావతిని పూర్తిగా చంపేయాలనే దుష్ట ఆలోచనలతో జగన్ రెడ్డి అండ్ కో రాజధాని రైతులను చిత్ర హింసలకు గురి చేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏపీ రాజధాని అమరావతిని కుప్పకూల్చి, ఎక్కడి పనులు అక్కడ ఆపేశాడని పేర్కొన్నారు. వీలైతే కూల్చేశాడు. రోడ్లను తవ్వేసి వైసీపీ నేతలు, కార్యకర్తలకు దోచిపెట్టాడు. అమరావతిని శ్మశానం అనీ, ఎడారి ప్రాంతం అని, ఒక్క సామాజిక వర్గానికి చెందిన ప్రాంతం అని...అమరావతిపై కమ్మరావతి అని జగన్ రెడ్డి అండ్ కో విద్వేష వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. వాస్తవానికి అమరావతి ప్రాంతంలో దళితులు, బీసీలు ఎక్కువగా ఉన్నారని గుర్తు చేశారు. రైతుల ప్రాణత్యాగాలు ఓవైపు, పోరాటాలు మరోవైపు, న్యాయస్థానాల జోక్యంతో రాజధాని అమరావతి చెక్కు చెదరకుండా అలా నిలబడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన పరిపాలనా దక్షతతో ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకులను ఒప్పించి తెచ్చిన నిధులతో అమరావతి పనులు రానున్న కాలంలో పరుగులు పెట్టబోతున్నాయని డాక్టర్ లక్ష్మీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఉచిత మెగా సమ్మర్ క్యాంప్‌కు విశేష స్పందన

### - నడకుదురు ప్రాథమిక పాఠశాలలో 72 మంది విద్యార్థులు హాజరు





**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్, కరప మండలం నడకుదురు గ్రామంలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబర్ వన్‌లో నిర్వహిస్తున్న ఉచిత మెగా సమ్మర్ క్యాంప్‌కు విద్యార్థుల నుండి విశేష స్పందన లభిస్తోంది. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సమ్మర్ క్యాంపులో తొమ్మిది రకాల యాక్టివిటీలను విద్యార్థులకు నేర్పించడంతో పాటు, వారి ప్రతిభను మెరుగు పరచేలా చర్యలు తీసుకుంటున్నామని ఉపాధ్యాయురాలు కె.విజయలక్ష్మి తెలిపారు. ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారుల సూచనలతో ఈ క్యాంపు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 72 మంది విద్యార్థులు క్యాంప్‌లో చేరారని, వారికి రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు పొందిన ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్స్ పాఠాలు బోధిస్తున్నారని ఉపాధ్యాయుడు వాకాడ వెంకట రమణ (చిన్న మాస్టర్) తెలిపారు. క్యాంప్‌లో పప్పెట్



షోలు, గణితంలో మెలుకువలు, క్లే ఆర్ట్, కర్సివ్ రైటింగ్ వంటి అంశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ శిబిరంలో 5 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు (ఎన్రోల్మెంట్) పెరగడంలో ఎంతో దోహదపడుతుందని మండల విద్యాశాఖ అధికారులు కె.బి. కృష్ణవేణి, పి.సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసి సభ్యులు పాల్గొన్నారు.

# ఎంపీడీవోల జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక

### - డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా యూనిట్ ఎంపీడీవోల సంఘం అధ్యక్షులుగా బి.కృష్ణమోహన్

**అల్లవరం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం డా.బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం నిర్వహించారు. అమలాపురం కలెక్టరేట్ వద్ద జరిగిన సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బి ఎస్ ఎస్ ఎస్ కృష్ణ మోహన్ (అల్లవరం), ఉపాధ్యక్షులుగా కె సత్యనారాయణ మూర్తి (మండపేట), ప్రధాన కార్యదర్శిగా కె వి.ప్రసాద్ (పి.గన్నవరం), కోశాధికారిగా బి కె ఎస్ ఎస్ వి రామన్ (ఆత్రేయపురం), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె వెంకటేశ్వరరావు (మామిడి కుదురు), మహిళా కార్యదర్శిగా కె పద్మజ్యోతి (రామచంద్రపురం), జాయింట్ సెక్రెటరీగా ఎస్.వి.చలం (కాట్రేనికోన)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




# ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తుల ప్రారంభం

### - మే 2వ తేదీ నుండి మే 19వ తేదీ వరకు దరఖాస్తు సమయం
### - ఆర్‌టీఈ చట్టం ప్రకారం 25 శాతం సీట్ల కేటాయింపు




**కరప, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్ల భర్తీకి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. హక్కు విద్యా చట్టం (ఆర్‌టీఈ–2009) ప్రకారం, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, రాష్ట్ర సిలబస్ బోధించే అన్ని ప్రైవేట్ పాఠశాలలు తమ మొదటి తరగతిలో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాల్సిందిగా పాఠశాల విద్యాశాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉచిత సీట్ల కోసం విద్యార్థులు మే 2వ తేదీ నుండి మే 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారులు తమ గ్రామ సచివాలయాల సహాయంతో ప్రభుత్వ వెబ్‌సైట్ www. cse.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు 02 ఏప్రిల్ 2019 నుండి 31 మార్చి 2020 మధ్య జన్మించి, ఐదు సంవత్సరాల వయస్సు పూర్తయ్యి ఉండాలి. వర్గాల వారీగా సీట్ల కేటాయింపు అనాథలు, దివ్యాంగులు, హెచ్ఐవీ బాధితుల పిల్లలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాలైన బీసీ, మైనారిటీ, ఓసీలకు 6 శాతం. అర్హత కలిగిన పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా చదువుకునే ఈ అవకాశం గొప్ప మార్గంగా నిలుస్తుందని మండల విద్యాశాఖాధికారులు కె.బుల్లి కృష్ణవేణి, పి. సత్య నారాయణ మూర్తి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు తెలిపారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రులు, ఎమ్మెల్యేలు



**గిద్దలూరు, (రాజధాని వార్తలు):** బిటీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు రిసెప్షన్ వేడుకలో పాల్గొని నూతన వధూవరులు నిహార్, శ్రీ సాయి నర్మదలను పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మంత్రు లు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనసభ్యులు, అశోక్ రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీకాంత్ మరియు తదితరులు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆశిష్ దేత్తడి ఫస్ట్ లుక్..మాసీవ్ అండ్ ఇంట్రెస్టింగ్




సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ తమ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మిస్తున్న 60వ ప్రాజెక్ట్‌ని ప్రకటించారు. తమ వారసుడు ఆశిష్ హీరోగా అత్యంత భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌ని ప్రకటించారు. రౌడీ బాయ్స్ మూవీతో హీరోగా పరిచయమైన ఆశిష్ తరువాత లవ్ మీ పేరుతో హారర్ థ్రిల్లర్‌లో నటించడం, అది ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల్ని మెప్పించలేకపోవడం తెలిసిందే. దీంతో కొంత విరామం తీసుకున్న ఆశిష్ సరికొత్త కథతో ప్రేక్షకుల్ని ఆకట్టుకోవాలనే ఉద్దేశ్యంతో కొత్త కథను ఎంచుకున్నాడు. వెర్సటైల్ క్యారెక్టర్లతో హీరోగా తనకంటూ ప్రత్యేతను చాటుకోవాలని తొలి సినిమా నుంచి ప్రయత్నాలు చేస్తున్న ఆశిష్ తాజాగా మన కల్చర్‌ని రిప్రజెంట్ చేసే కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ మూవీకి ఆదిత్య రావు గంగసాని దర్శకత్వం వహిస్తుండగా ఇందులో ఆశిష్ అత్యంత సహజత్వంతో సాగే స్ట్రీట్ డ్రమ్మర్‌గా నేటీవిటీకి చాలా దగ్గరగా ఉన్న క్యారెక్టర్‌లో కనిపించనున్నాడు. ఆశిష్ మూడవ ప్రాజెక్ట్‌గా తెరపైకి వస్తునక్న ఈ మూవీని దిల్ రాజు, శిరీష్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తు న్నారు. విభిన్నమైన కథ, కథనాలతో ఆశిష్‌ని హీరోగా, నటుడిగా నిలబెట్టే రూటెడ్ స్టోరీతో తెరకెక్కుతున్న ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు టైటిల్‌ని మేకర్స్ గురువారం విడుదల చేశారు. హీరో ఆశిష్ పుట్టిన రోజుని పురస్కరించుకుని ఈ మూవీ టైటిల్‌తో పాటు ఫస్ట్‌ని విడుదల చేశారు. ఈ చిత్రానికి దేత్తడి అనే టైటిల్‌ని ఫైనల్ చేశారు. ఇక ఫస్ట్ లుక్‌లో హీరో ఆశిష్ టైటిల్‌కు తగ్గట్టుగానే మాసీవ్ క్యారెక్టర్‌లో స్ట్రీట్ డ్రమ్మర్‌గా కనిపించడం అందరిని ఆకట్టు కుంటోంది. ఆశిష్ మాసీవ్ లుక్‌లో డ్రమ్మర్‌గా కనిపిస్తున్న తీరు ప్రాజెక్ట్‌పై అందరిలోనే ఆసక్తిని రేకెత్తిస్తోంది. టైటిల్‌తో పాటు క్యాప్షన్ కూడా ఇంట్రెస్ట్‌ని క్రిమయేట్ చేస్తోంది. గాడ్ ఘటీతో ఘటీ మగర్ నవాబి నా ఘటీ అనే క్యాప్షన్‌ని చూస్తుంటే ఈసారి ఆశిష్ పక్కా రూటెడ్ స్టోరీతో రా కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడని స్పష్టమవుతోంది. అంతే కాకుండా ఆశిష్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్, క్యాప్షన్‌ని బట్టి ఈ మూవీ పక్కా తెలంగాణ స్లాంగ్‌తో సాగుతుందని తెలుస్తోంది. తెలంగాణ నేపథ్య కథలతో విజయాలు అందు కుంటున్న దిల్ రాజు మరోసారి అదే స్లాంగ్‌ని, అదే నేప థ్యాన్ని ఆశిష్ కోసం ఎంచుకున్నట్టుగా తెలుస్తోంది. ఇండి యన్ సినిమాల్లో ఇంత వరకు ఎవరూ టచ్ చేయని నేపథ్యం లో రానున్న ఈ మూవీ ఆశిష్‌కు హీరోగా సరికొత్త ఇమేజ్‌ని అందించడం ఖాయం అని మేకర్స్ భావిస్తున్నారు. సరికొత్త నేపథ్యంలో విభిన్నమైన కథగా రూపొందనున్న ఈ మూవీ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది.

# వెంకీ రేంజు 300 కోట్లు.. త్రివిక్రమ్ టెన్షన్!





టాలీవుడ్ స్టార్ హీరోల ఎస్కలేషన్ అనూహ్యమైనది. బాహుబలితో కేవలం ప్రభాస్ రేంజ్ మాత్రమే కాదు, మొత్తం టాలీవుడ్ రేంజ్ పెరిగింది. టాలీవుడ్ స్టార్ హీరోల రేంజ్ అమాంతం ఎగసింది. ఇప్పుడున్న సీనియర్ హీరోలు సైతం తమ స్టామినాని మించి పోరాడే సత్తువను సంపాదించారు. ముఖ్యంగా విక్టరీ వెంకటేష్ విషయానికి వస్తే, పట్టుమని 100 కోట్లు అయినా కష్టమే అనుకునే చెడు నోళ్లకు తాళం వేస్తూ, ఒకే ఒక్క సినిమాతో 250 కోట్ల క్లబ్‌లో అడుగు పెట్టాడు. విక్టరీ వెంకటేష్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం 250 కోట్లు వసూళ్లతో రియల్ విక్టరీ ఎలా ఉంటుందో చూపించింది. సీనియర్లలో ఓవర్ నైట్ సంచలనాలకు కేరాఫ్ గా మారాడు వెంకీ. వయసుతో సంబంధం లేకుండా విక్టరీ కూడా పాన్ ఇండియన్ హీరోనే ఇప్పుడు. అయితే వెంకటేష్ నటించే తదుపరి చిత్రం ఎలా ఉండాలి? అంటే.. ఇదిగో ఈ రేంజుకు తగ్గితే కుదరదని ఫ్యాన్స్ దర్శకులను హెచ్చరిస్తున్నారు. 250 కోట్ల నుంచి 300 కోట్ల క్లబ్‌లోకి వెంకీ రావాలి. అతడు రజనీకాంత్‌లా 500 కోట్లు కొల్లగొట్టాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇలాంటి సమయంలో తక్కువ టైమ్ లో త్రివిక్రమ్ ఏదో ఒక సినిమా తీసేస్తాను అంటే కుదరదని కూడా వెంకీ మామ ఫ్యాన్స్ హెచ్చరిస్తున్నారు. త్రివిక్రమ్ ఏది ప్లాన్ చేసినా అనీల్ రావిపూడిని మించిన విజయాన్ని వెంకీకి కట్టబెట్టాలి. దానికోసం ఏం చేస్తాడో అది అతడి ఇష్టం! అని ఫ్యాన్స్ సోషల్ మీడియాల్లో పంచ్‌లు విసురుతుంటే త్రివిక్రమ్‌కి ఏం పాలుపోవడం లేదట! పుష్ప స్టార్ అల్లు అర్జున్‌తో చేయాల్సిన సినిమా ఆలస్యమవుతుంటే, వెంకీతో తక్కువ సమయంలో ఒక సినిమాని త్రివిక్రమ్ పూర్తి చేస్తాడని కథనాలొస్తున్నాయి. కానీ ఫ్యాన్స్ అంచనాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. మరి దీనిని మాయావి త్రివిక్రమ్ సీరియస్‌గా తీసుకుంటున్నారా లేదా? చూడాలి. వెంకీతో త్రివిక్రమ్ సినిమాని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్ నిర్మించనుంది.

# 25 ఏళ్లలో స్టార్ హీరోయిన్ ఆర్జన షాకిస్తోందే!



తెలుగు, తమిళంలో అగ్ర కథానాయికగా కొనసాగు తున్న త్రిష తన రెండున్నర దశాబ్దాల కెరీర్‌లో ఏ మేరకు ఆస్తుల్ని సంపాదించింది? ఈ ప్రశ్నకు సమాధానం వెతికితే... జాతీయ మీడియా వివరాల ప్రకారం.. త్రిష రూ.90 కోట్ల ఆస్తులను కూడగట్టిందని సమాచారం. 1999లో జోడి అనే చిత్రంతో నటిగా పరిశ్రమలో అడుగు పెట్టిన త్రిషకు టాలీవుడ్ గొప్ప గుర్తింపును ఇచ్చింది. ప్రభాస్ సరసన వర్షం త్రిష కెరీర్ గేమ్ ఛేంజర్. ఆ తర్వాత కెరీర్ జర్నీ గురించి తెలిసిందే. నిన్న మొన్నటి పొన్నియన్ సెల్వన్ ఫ్రాంఛైజీ సినిమాల వరకూ త్రిష అజేయమైన ప్రయాణాన్ని సాగించింది. త్రిష ఒక్కో సినిమాకు రూ.3 కోట్లకు పైగా పారితోషికం అందుకుంటోంది. వాణిజ్య ప్రకటనల ఏడాది కాంట్రాక్ట్ కోసం రూ.9 కోట్లకు పైగా సంపాదిస్తుంది. పొన్నియిన్ సెల్వన్: 1 విజయం తర్వాత లియో కోసం రూ.5 కోట్లకు పారితోషికాన్ని పెంచిందని కథనాలొచ్చాయి. త్రిషకు పలు నగరాల్లో ఆస్తులు ఉన్నాయి. హైదరాబాద్‌లో 6 కోట్ల ఖరీదు చేసే ఇల్లు, చెన్నైలో 10 కోట్ల విలువ చేసే విలాసవంతమైన ఇల్లు ఉన్నాయి. త్రిష కార్ల గ్యారేజీలో కోట్లాది రూపాయల విలువ చేసే లగ్జరీ కార్లు ఉన్నాయి. రూ.63 లక్షల నుండి రూ.80 లక్షల రేంజులో పలు బ్రాండెడ్ కార్లను కొనుగోలు చేసింది.

మరో రెండు మూడేళ్లలో పెరుగు తున్న ధరలు, మార్కెట్ విలువ దృష్ట్యా త్రిష 100 కోట్ల నికర ఆస్తుల క్లబ్‌లో చేరుతుందని అంచనా. త్రిష చివరి సారిగా అజిత్ చిత్రం విదాముయార్చిలో కనిపించింది. ఈ సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. తదుపరి మెగాస్టార్ విశ్వంభరలో నటిస్తోంది. పలువురు సీనియర్ హీరోలకు త్రిష బెస్ట్ ఆప్షన్‌గా ఉంది. 41 ఏజ్‌లోను నేటితరం కథానాయికలతో పోటీపడుతూ త్రిష కెరీర్ జర్నీని విజయ వంతంగా కొనసాగిస్తోంది.

# ఆ ప్లానింగ్‌లోనే స్మాల్ స్క్రీన్ తళుకులా..?



ఒకప్పటి హీరోయిన్స్ అంతా కూడా ఇప్పుడు మళ్లీ తెర మీద రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇప్పుడు హీరోయిన్స్ రోల్స్ చేయడం కష్టం కాబట్టి వారికి తగిన పాత్రలను చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. ఈమధ్యనే మన్మథుడు సినిమా అన్షు మజాకా సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చింది. ఆమె దారిలోనే ఒకప్పటి స్టార్ హీరోయిన్ లయ కూడా సిల్వర్ స్క్రీన్ రీ ఎంట్రీ ఇస్తుంది. నితిన్ హీరోగా వేణు శ్రీరామ్ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న తమ్ముడు సినిమాలో లయ సిస్టర్ రోల్ చేస్తుంది. ఈ సినిమాలో ఆమెది ప్రధాన పాత్ర అని తెలుస్తుంది. దిల్ రాజు బ్యానర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నితిన్, లయ మధ్య ఎమోషనల్ సీన్స్ ఆడియన్స్‌ని కట్టిపడేస్తాయని అంటున్నారు. ఐతే రీ ఎంట్రీ ఇచ్చే టైంలో లయ ముందు స్మాల్ స్క్రీన్‌పై ఆడియన్స్‌కి టచ్‌లోకి వచ్చింది. సూపర్ హిట్ కామెడీ షో జబర్దస్త్ షోలో ఆమె ప్రస్తుతం జడ్జిగా కొనసాగుతుంది. అక్కడ శివాజీతో పాటు లయ జడ్జిగా చేస్తుంది. అక్కడ ఆమె పొజిషన్ పర్మినెంటా లేదా టెంపరరీనా తెలియదు కానీ శివాజీ, లయ ఆ జడ్జి సీట్లో కూర్చుంటే చూడటానికి బాగుంది. ఐతే సిల్వర్ స్క్రీన్ రీ ఎంట్రీ ముందే స్మాల్ స్క్రీన్‌పై ఆడియన్స్‌కి దగ్గరైతే కెరీర్ మళ్లీ ఊపందుకునే ఛాన్స్ ఉంటుందని లయ ఇలా జబర్దస్త్ షోలో జడ్జిగా చేస్తుంది. తమ్ముడు ఆఫర్ రాగానే ఆమె ముందు ఆలోచించి చేస్తానని చెప్పినా ఎలాగు చాలామంది హీరోయిన్స్ ఈమధ్య రీ ఎంట్రీ చేసి అలరిస్తున్నారనే కారణంతో లయ కూడా ఆ సినిమాకు ఓకే చెప్పింది. ఐతే లయ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వల్ల తమ్ముడు సినిమాకు కొంత స్పెషల్ క్రేజ్ ఏర్పడింది. జబర్దస్త్‌లో జడ్జిగా ఆల్రెడీ ప్రేక్షకులతో సూపర్ అనిపించుకుంటున్న లయ నెక్స్ట్ తమ్ముడు సినిమాతో మరోసారి తన సిల్వర్ స్క్రీన్ పర్ఫార్మెన్స్‌తో అలరించాలని చూస్తుంది. తమ్ముడు సినిఒమా మీద నితిన్ కూడా సూపర్ కాన్ఫిడెంట్‌గా ఉన్నాడు. రాబిన్ హుడ్ అంచనాలను అందుకోలేదు కాబట్టి తమ్ముడు సినిమాతో సూపర్ హిట్ కొట్టాలని చూస్తున్నాడు నితిన్. మరి ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఉంటుందా లేదా అన్నది చూడాలి. షూటింగ్ చివరి దశలో ఉన్న తమ్ముడు సినిమా త్వరలోనే రిలీజ్ ఎప్పుడన్నది ఎనౌన్స్ చేస్తారని తెలుస్తుంది.

# ఎన్.టి.ఆర్. భరోసా పింఛన్లు సక్రమంగా, సకాలంలో పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలి

**- జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశం**




**అనకాపల్లి మండలం కోడూరు పంచాయతీ ఎస్.సి. కాలనీలో ఎన్.టి.ఆర్. భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్**

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** పేదల సేవలో భాగంగా పంపిణీ చేస్తున్న ఎన్.టి.ఆర్. భరోసా పింఛన్లు సక్రమంగా, సకాలంలో పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం అనకాపల్లి మండలం కోడూరు పంచాయతీ ఎస్.సి. కాలనీలో ఎన్.టి. ఆర్. భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు పెన్షను డబ్బులు అందజేసారు. పెన్షను పంపిణీకి ముందుగా ముఖ్యమంత్రి వారి సందేశం లబ్దిదారులకు వినిపించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టరు లబ్దిదారులతో మాట్లాడుతూ ప్రతినెల పెన్షన్లు సక్రమంగా అందుతున్నాయా, ప్రభుత్వం అందిస్తున్న పెన్షను డబ్బులు పూర్తిగా అందుతున్నాయా, పెన్షను అందజేస్తున్నపుడు ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెన్షన్లు అందుకున్నప్పుడు డబ్బులు సరిచూసుకోవాలని తెలిపారు. లబ్దిదారులు పెన్షన్లు పంపిణీ ప్రక్రియపై సంతృప్తి, సంతోషం వ్యక్తం చేసారు. అనంతరం జిల్లా కలెక్టరు అధికారులతో మాట్లాడుతూ పెన్షన్లు పంపిణీ తొలిరోజే పూర్తి చేయుటకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఎ. ప్రోజెక్టు అదికారి కె.శచీదేవి, మండల అభివృద్ధి అదికారి నర్సింగరావు, గ్రామ సర్పంచ్ సేనాపతి లక్ష్మీశ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించిన జిల్లా కార్మిక శాఖ అధికారి వసంతరావు




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** మాలపేట గ్రామంలో మే డే సందర్భంగా తాపీ మేస్త్రి సంఘం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. లక్ష్మివారం జరిగిన వైద్య శిబిరం కార్యక్రమాన్ని జిల్లా కమిషనర్ ఆఫ్ లేబర్ వసంతరావు ప్రారంభించారు. సుమారు 80 మంది కార్మిక కుటుంబాలు డాక్టర్ అరుణ పరీక్షలు చేశారు. కార్యక్రమం లో శంకర్ ఫౌండేషన్ సభ్యులు పూసర్ల రాజా, కార్మిక సంఘం అధ్యక్షులు చీర అప్పలరాజు, కార్యదర్శి మారేడిపూడి సత్యనారాయణ, నాయకులు గుమ్మాల



నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి మోడీ సభను జయప్రదం చేసేందుకు అంతా తరలి వెళ్దాం



**అరకు, (రాజధాని వార్తలు):** జన సైనికులు అందరికీ నమస్కారం .....అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు మే 02 అనగా బుధవారం అమరావతికి విచ్చేస్తున్న ప్రధాన మంత్రివర్యులు గౌరవ నరేంద్ర మోడీ సభను విజయవంతం చేసేందుకు జనసైనికులు అంతా భారీ సంఖ్యలో తరలి వెళ్దాం...మోడీ సభకు తరలి వెళ్లేందుకుగాను పాడేరు నియోజకవర్గానికి 12 బస్సులు కేటాయించారు. ప్రతి మండలం నుంచి రెండు బస్సులు కేటాయించడం జరిగింది. ఈ బస్సుల బాధ్యతలను తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులకు అప్పగించడం జరిగింది. కావున జనసేన పార్టీ మండల అధ్యక్షులు తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షులతో సమన్వయం చేసుకొని మోడీ సభకు భారీ ఎత్తున కూటమి నాయకులు, ప్రజలు తరలి వెళ్లేలా చూడాలని కోరుతున్నాం.

ఇట్లు,

**వంపూరు గంగులయ్య,** ఇన్చార్జ్,

పాడేరు అసెంబ్లీ, అరకు పార్లమెంట్ నియోజకవర్గం

# 84వ వార్డులో సభ్యత్వ నమోదు కార్డులు పంపిణీ : మాదంశెట్టి నీలబాబు

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** 84వ వార్డు తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్డులు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అనకాపల్లికి సభ్యత్వం కార్డులు పంపించారని, వీటిని 84వ వార్డు ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు ఆధ్వర్యంలో ఇంటింటికి సభ్యత్వం నమోదు కార్డు ట్యాగ్‌తో పాటు 194వ బూత్‌లో 163 మంది సభ్యులకు అందజేశామని అనకాపల్లి పార్లమెంటు ఆర్గనైజింగ్ కార్యదర్శి కుప్పిలి జగన్ తెలియజేశారు. అలాగే 195, 196 బూత్‌లకు సంబంధించి సభ్యత్వం నమోదు చేసుకున్న వారందరికీ కూడా అందజేస్తామని జగన్ అన్నారు. ఈ కార్యక్రమంలో బోడి



వెంకటరావు అయిత అప్పలనారాయణ సారిపల్లి శ్రీనివాసరావు కాండ్రేగుల జగదీష్ కసిరెడ్డి కొండలరావు ముగ్గ తమ్మారావు కెల్లక శ్రీనివాసరావు ఎం రాజా కాసిన లక్ష్మి ఏనుగుల దేవి రోమాల లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

# మైలవరం మండలంలో సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో మేడే సందర్భంగా పతాకావిష్కరణలు




**మైలవరం, (రాజధాని వార్తలు):** ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా మైలవరం మండలంలో సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా పతాకావిష్కరణలు జరిగాయి. మైలవరం సెంటర్లోని అమరవీరుల సూపం వద్ద మైలవరం నియోజకవర్గ కార్యదర్శి, జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్ చే పార్టీ పతాకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి బుద్ధారపు వెంకట్రావు అధ్యక్షత వహించగా, బుడ్డి రమేష్ ప్రసంగిస్తూ ఎంతోమంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను సైతం నాలుగు నల్ల చట్టాల ద్వారా విభజించి బడా కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్నాయని, కార్మిక వర్గం మొత్తం ఏకమై నాలుగు లేబర్ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు ఇచ్చారు. మండలంలోని పార్టీ కార్యాలయం కార్మిక భవన్‌పై, ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద, కనిమేర్ల పర్వతాపురం పోరాట నగర్‌లో కూడా పార్టీ పతాకాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ సహాయ కార్యదర్శి బానోతు పెద్ద బాలు నాయక్, కారుమూరు రత్నకుమారి, భూక్య సోములు, ఆంబోతు నాగు, భూక్య అయ్య ఎంపీటీసీ సభ్యులు, సంధిపాము మహేష్, దేవరకొండ కన్నయ్య, షేక్ జిలాని, షేక్ సుభాని, జి సురేష్, భూక్య యేసు, జి ప్రసాద్, ఆర్ ప్రసాద్, జయరాజు, జె రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అనకాపల్లిలో హీరో నాని అభిమానులు ఆధ్వర్యంలో హిట్ -3 చిత్రం విజయోత్సవ వేడుకలు




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఈ రోజు అనకాపల్లి శిరిడి సాయి. పర్తి సాయి థియేటర్లో హీరో నేచురల్ స్టార్ నాని నటించిన హిట్ – 3 చిత్రం శుక్రవారం నాడు విడుదలయ్యి ఘన విజయం సాధించిన సందర్భంలో అనకాపల్లి జిల్లా నాని ఫ్యాన్స్ అధ్యక్షులు గౌరీపట్నపు సురేష్ ఆధ్వర్యంలో ముందుగా అభిమానుల సమక్షంలో విజయోత్సవ వేడుకల కేక్ కటింగ్ నిర్వహించి అనంతరం చిత్రాన్ని వీక్షించిన ప్రేక్షకులకు మజ్జిగ ప్యాకెట్లు మరియు థియేటర్ యాజమాన్యం ఫ్రూట్స్ పంపిణీ చేపట్టడం జరిగింది.

ఈ సందర్భంగా నాని ఫ్యాన్స్ అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ మా హీరో నాని ఈ 2025 సంవత్సరంలో అడుగు పెట్టిన సందర్భంలో మొదటగా నిర్మాతగా కోర్టు చిత్రాన్ని కొత్త నటీనటులతో రిలీజ్ అయ్యి ఘన విజయం సాధించిన సందర్భంగా ఇప్పుడు మళ్లీ నాని హీరోగా డైరెక్టర్ డాక్టర్ శైలెస్ కొలను తెరకెక్కించిన హిట్–3 చిత్రం ద్వారా ఈ రోజు విడుదలయ్యి మంచి విజయం సాధించింది. ప్రేక్షకులు ఆదరణ పొందుకుంటున్నారని రానున్న రోజుల్లో హీరో నాని మరొక చిత్రం పేరడైజ్ ద్వారా మన ముందుకు రాబోతున్నారు అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్. భాను చందర్ (అఖి), ఉప్పల సాయి, నాని అభిమానులు మణికంఠ, అరుణ కుమార్, నాని, నవీన్, రాజా, ప్రసాద్, ఉమ, పురుషోత్తం, చందు, నాయుడు మరియు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan